

# నీలివెలుగు

**మళయాళీ కథ**

**వైకం మహ్మద్ బషీర్**

**అనువాదం- టి. లలితాప్రసాద్**





నా జీవితంలో జరిగిన ఓ అద్భుతమైన సంఘటన గురించింది ఈ కథ. దీన్ని సంఘటన అనే కంటే ఆశ్చర్యచకితులను చేసే వో పెద్ద బుడగ అనడమే సబబు. దీన్ని శాస్త్రపరమైన నిజానిజాలతో పొడిచేందుకు పరిశీలించాను. కానీ పగలలేదు. అది మీకు వీలు కావచ్చునేమో! అంటే బుడగ గురించీ నిశితంగా పరిశీలించి ఛేధించడం. అంచేత దీన్నో అద్భుతంగానే భావిస్తాను.

రోజు, నెల, సంవత్సరం అనేవి పక్కకి పెడితే అసలు జరిగిందిది. నేను ఓ ఇంటి కోసం వెతుకుతున్నా. అదేం కొత్త కాదు - ఎప్పుడూ ఇళ్ళ వేటలో ఉంటా గనుక. నాకు నచ్చిన ఇల్లు పోనీ గదయినా ఎప్పుడూ దొరకవు. నేను ఉండే చోట కనీసం వంద లోపాలయినా కనిపిస్తాయి నాకు. కానీ వాటి గురించీ ఎవరికి ఫిర్యాదు చేయను. ఇల్లు నచ్చకపోతే వెళ్ళిపోవాలి. కానీ ఎక్కడికి? అంచేత ఎంత ఇబ్బందిగా ఉన్నా అయిష్టంతోనయినా అక్కడే ఉంటాను. అక్కడేవన్నా ఇళ్ళు, గదులు ఉన్నాయి. బొత్తిగా ఇష్టం లేనివి. తప్పు ఎవరిదయినా కావచ్చు. అయినా అవంటే ఇష్టం లేదు. అంచేత ఇల్లు వదిలేశాను. ఎవరో ఒకరు వస్తారు. ఆడో, మగో వారికి నచ్చొచ్చు. అద్దె కొంపల కథే అంతా!

అద్దెకి ఇల్లు దొరకడమే కష్టంగా వున్న రోజులు. గతంలో పది రూపాయలకి దొరికేవి ఇప్పుడు యాభై రూపాయలకయినా దొరకడం లేదు. అంచేత నేను వో ఇంటి కోసం వెతుకుతున్నా.

దొరికింది... అదిగో...

అదో వొంటి అంతస్థు మేడ ఇల్లు. ఊరు పొలిమేర్ల దగ్గరగా, హడావుడి లేకుండా ఉంది. అదృష్టవశాత్తు దానికి 'టులెట్' బోర్డ్ ఉంది - బాగా దుమ్ముపట్టి!

ఎలాగయితేనేమి ఆ ఇల్లు నచ్చింది. మేడపైన రెండు గదులు, విశాలంగా బాల్కనీ ఉన్నాయి. కింద నాలుగు గదులున్నాయి. ఒక బాత్‌రూం, వంటగది, మంచినీటి కుళాయి ఉన్నాయి. కరెంటు మాత్రం లేదు. ఇంటి ఆవరణలో ఓ మూల లెట్రిన్, పెరట్లో బావి ఉన్నాయి. బావి చుట్టూ రాళ్ళతో చిన్న పిట్టగోడలా ఉంది. ఇంటి చుట్టూ చెట్లూ - గోడలా. అక్కడున్న సుఖమేమంటే చుట్టుపక్కలా ఎవరూ లేరు. కానీ రోడ్డు మీదకే ఉంది ఆ ఇల్లు.

ఇన్నాళ్ళూ ఈ ఇంట్లో ఎవరూ ఎందుకు చేరలేదా అని ఆశ్చర్యం, నాకు దొరికినందుకు ఆనందం కలిగింది. దారిలో వెళుతున్న వో చక్కటి అమ్మాయిని చూసినట్టు అదృష్టవశాత్తూ ఆ అమ్మాయిని ముసుగులో దాచినట్టు భావించుకున్నాను. తమాషాగా ఆ ఇల్లు కనిపించగానే. అంతే వెంటనే ఇల్లు తీసుకోడానికి ఆనందంతో పరుగున వెళ్ళి తగిన డబ్బు అప్పు సంపాదించాను. రెండు నెలలు అడ్వాన్సు కట్టాను. తాళాలు తీసుకున్నాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ ఇంట్లో చేరాను. అదేరోజు నేనూ లాంతరు కొన్నాను.

ఇల్లంతా చిమ్మి శుభ్రం చేశాను. అన్ని గదులు అంతటా చెత్తా చెదారం. వంటగది, బాత్‌రూంతో సహా. అన్ని గదులు కడిగి శుభ్రం చేశాను. చాలా ఆనందంగా ఉంది. హాయిగా కూచుని కథలు రాయచ్చు. కాంపౌండ్‌లో సరదాగా పచార్లూ చేయొచ్చు. చక్కగా పూల మొక్కలు వేసుకోవచ్చు. గులాబీలు, సన్నజాజులు ఉండాలి. వంటవాడిని పెట్టుకోవాలని ఆలోచించాను. వద్దు... అదో తలనొప్పి. పొద్దుటే స్నానంచేసి టీ తాగడానికి వెళతాను. ఫ్లాస్క్‌లో ఇంటికీ టీ తెచ్చుకోవచ్చు. పోతే మధ్యాహ్నం భోజనానికి ఏదయినా హోటల్ వెతుక్కోవాలి. రాత్రి భోజనం ఇంటికే పంపమని అడగాలి. పోస్ట్‌మాన్‌ని కలిసి ఇక్కడ ఉండడానికి వచ్చానని పరిచయం చేసుకుంటాను. ఈ ఇంట్లోకి వచ్చినట్టు ఎవరికీ చెప్పొద్దనీ అతనికి చెప్తాను. రాత్రీ పగలూ వొంటరిగా హాయిగా గడపొచ్చు. ఎంత ఆనందం... ఇలా అనుకుంటూ బావిలోకి తొంగి చూశాను. పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగి ఉన్నాయి. నీళ్ళు కనిపించలేదు. ఓ రాయి విసిరాను. 'ఫ్లాంగ్' అని శబ్దం... నీళ్ళున్న శబ్దం వచ్చింది.

ఉదయం పదకొండయింది.

క్రితం రాత్రి నిద్రలేదు. రెప్పవాల్చలేదు. సాయంత్రం హోటల్‌లో చెల్లించాల్సిందంతా ఇచ్చేశాను. ఇంటి యజమానిని కలిశాను. నా పక్కబట్టలు, గ్రామ్‌ఫోన్, రికార్డులు, పుస్తకాలు, పడక్కుర్చీ, బుక్‌షెల్ఫ్, సమస్త వస్తు సామగ్రి కట్టగట్టాను. రెండు ఇళ్ళల్లోకి ఎక్కించి ఉదయాన్నే బయలుదేరి వచ్చాను. కొత్త ఇంటి తలుపులు వేసి తాళం పెట్టి వీధిలోకి వచ్చాను. రాత్రికి ఎవరి సంగీతం వినాలా అని ఆలోచనలో పడ్డాను. నా దగ్గర వందకు పైగా గ్రామ్‌ఫోన్ రికార్డ్స్ ఉన్నాయి. ఇంగ్లీష్, అరబిక్, హిందీ, ఉర్దూ, తమిళం, బెంగాలీ, ఒక్క మళయాళీవే లేవు. మళయాళంలోనూ బాగా పాడేవారు ఉన్నారు. వారి రికార్డ్స్ కొనవచ్చు. కానీ సంగీతమే అంతగా బాగోదు. మళయాళంలో మంచి మ్యూజిక్ డైరెక్టర్స్ ఎప్పుడు వస్తారో? అంటే దిలీప్‌కుమార్ రాయ్, పంకజ్ మల్లిక్‌ల్లా. ఎవరి రికార్డ్ ముందుగా వినాలి? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. పంకజ్ మల్లిక్, దిలీప్‌కుమార్ రాయ్, సైగల్, బ్రింగ్ క్రాస్బీ, పాల్‌రాబ్సన్, అబ్దుల్ కరీంఖాన్, కానన్‌దేవి, మజుందార్ గుప్తా, ఖుర్షీద్, జ్యోతికారాయ్, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి... వో పది, ఇరవై పేర్లు గుర్తొచ్చాయి. చివరికి ఒక పాట వినడానికి నిర్ణయించుకున్నా. ఆ పాట ఇలా మొదలవుతుంది. 'దూర్ దేశ్ కె రహనే వాలా ఆయా...' అంటూ. నిజానికి ఆ పాట ఎవరు పాడారో సరిగా గుర్తే లేదు. ఆడో, మగో తెలీదు. గమనించాలి. నడక సాగించాను.

దారిలో ముందుగా పోస్ట్‌మాన్ కనిపించాడు. నేను ఫలానా చోట ఉంటున్నానని వివరంగా చెప్పాను. అడ్రస్ విని ఆశ్చర్యపోయాడు. అయ్యో... ఆ ఇంట్లోనా. వద్దు సార్... అక్కడ ఒక ఘోర హత్య జరిగింది. అందుకే అది ఖాళీగా ఉంది'' అన్నాడు హెచ్చరికగా, కంగారుతో.

''ఏమిటీ... హత్య జరిగిందా?'' ఖంగారుపడ్డాను నేనూ.

''ఎలా జరిగింది?'' అడిగాను ఉత్సుకతతో.

''పెరట్లో బావి ఉంది కదా! అందులోకి వొకరు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్నుంచీ ఆ ఇంట్లో ప్రశాంతత లేదు. చాలామంది ఆ ఇంట్లో ఉన్నారు. రాత్రిళ్ళు తలుపులు గట్టిగా కొట్టుకుంటాయి. కుళాయిల్లో నీళ్ళు పోతూంటాయి''

తలుపులు గట్టిగా కొట్టుకుంటాయా? కుళాయిల్లో నీరు పోతూంటాయా? చాలా ఆశ్చర్యంగా ఉందే? మరి కుళాయిలన్నీ సరిగా కట్టేసే ఉన్నాయి గదా?! ఎవరెవరో గోడ దూకి వచ్చి స్నానాల గది వాడుతూంటారని ఇంటాయన చెప్పాడు. అసలు అప్పుడే అడగాల్సింది తాళం వేసున్న ఇంటికి కుళాయిలకీ తాళాలు ఎందుకా అని? అసలు దీన్ని గురించీ బొత్తిగా ఆలోచించనే లేదు...

''అంతేకాదు... నీ గొంతుపట్టి ఉరేస్తుంది''

''ఇవేమీ ఎవరూ చెప్పలేదా?''

''వోహో... రెండు నెలలు అడ్వాన్స్ కూడా ఇచ్చాను''

''అయినా ఎవరు మటుకు ఏం చేయగల్గుతారు? పరిస్థితి అలాంటిది...'' అనుకున్నా నాలో నేను. కానీ పైకి మాత్రం ''ఛ... అదేం పెద్ద భయపడాల్సిందేమీ గాదు. వో మంత్రం జపిస్తే చాలు... సరేగాని నా ఉత్తరాలన్నీ అక్కడికి చేరేట్టు చూడు'' అన్నాను.

అలా చాలా ధైర్యాన్ని ప్రకటించాను. నిజానికి నేను అంత ధైర్యవంతుడిని కాను. అలాగని మరీ పిరికివాడినీ కాను. కాబోతే అందరూ భయపడ్డట్టే నేను కొద్దిగా భయపడ్డాను. అంచేత నేను పిరికివాడినీ కావచ్చు. ఇంతకీ నేనేం చేయాలి? ఏదొక అనుభవం సంపాదించాలని పరిస్థితుల్ని కల్పించుకోలేదు. అనుకోకుండా తలవని తలంపుగా అనుభవమయింది? మరి ఏం జరుగుతుంది?

నేనొక హోటల్‌కి వెళ్ళాను. టీ తాగాను. భోజనం చేయాలని అనిపించలేదు. ఆకలిగానూ ఉంది. రాత్రి భోజనం ఇంటికి పంపించమని హోటల్ యజమానితో మాట్లాడాను. ఇంటి అడ్రస్ వినగానే అతనూ కంగారుపడ్డాడు.

''పగటి పూట భోజనం పంపిస్తాను. కానీ రాత్రిళ్ళు సర్వర్స్ ఎవరూ అక్కడికి రారు. అక్కడ బావిలో ఒకామె పడి చచ్చింది. ఆమె అక్కడే ఉందని అనుమానం. మీకు దయ్యాలంటే భయం లేదా?''

అతనలా అడగడంతో సగం భయం పోయింది. వీళ్ళంతా ఒకామె గురించే చెబుతున్నారే?

''అబ్బే... అదేం పెద్ద భయపడాల్సింది గాదు. నా దగ్గర దానికి తగ్గ మంత్రం ఉంది'' అన్నాను.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న బ్యాంక్‌కి వెళ్ళాను. అందులో ఇద్దరు ముగ్గురు స్నేహితులు ఉన్నారు. నేను ఇల్లు తీసుకున్న విషయం వాళ్ళకి చెప్పాను. సంతోషించే బదులు కోపగించుకున్నారు... అడ్రస్ తెలిసి!

''ఎంత పిచ్చి పని చేశావ్. అదో దెయ్యాల కొంప. తీసుకునే ముందు మమ్మల్ని అడగాల్సింది. మగాళ్ళని పట్టి పీడించేవి ఉన్నాయిట'' అన్నారు హెచ్చరికగా.

అంటే దయ్యాలకీ మగాళ్ళంటే పడదన్నమాట... బావుంది!

''ఇల్లు తీసుకునే ముందు సలహా అడగాల్సింది'7

''ఆ విషయం ముందు ఎలా తెలుస్తుంది. ఇంతకీ ఆమెవరో అలా ఆత్మహత్య ఎలా చేసుకుంది?''

''ఛ... ఏదో ప్రేమ వ్యవహారం'' అంటూ వివరించారు.

''ఆమె పేరు భార్గవి. వయస్సు ఇరవై రెండు. ఎవరినో గాఢంగా ప్రేమించింది. కానీ అతగాడు మరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయి బి.ఏ. పాసైంది. ప్రేమికుడి పెళ్ళిరోజే ఆమె బావిలో దూకి చనిపోయింది...'' అంతా వివరించారు.

అసలు విషయం తెలిశాక సగం భయం పోయింది. మగాళ్ళంటే శతృత్వానికి అదన్నమాట కారణం.

''అయినా ఆ భార్గవి నన్నేం చేయదులే...''

''దేనికని?''

''నా దగ్గర్లో మంత్రం ఉంది...''

''సరే... చూస్తాంగా... రాత్రి గట్టిగా అరుస్తావ్ భయంతో!''

వెటకారం చేశారు. నేనేమీ సమాధానం చెప్పలేదు. ఇంటికి వచ్చి తలుపులన్నీ బార్లా తెరిచాను. కిందికి వచ్చి పెరట్లో బావి దగ్గర నుంచున్నా. బాగా పరిచయమున్నట్టు భార్గవితో ముఖాముఖి మాట్లాడినట్టు మాట్లాడాను. చాలా చిన్నగా.

''అమ్మా భార్గవీ... మనం ఎప్పుడూ కలవనే లేదు. ఇక్కడ వుండాలని వచ్చాను. నా ఉద్దేశంలో నేను చాలా మంచివాడినే. ఘోటక బ్రహ్మచారినీ. నీ గురించీ ఎంతో విన్నాను. ఈ ఇంట్లో ఎవర్నీ ఉండనీయవని. రాత్రిళ్ళు తలుపులు శబ్దం చేయడం, కుళాయిల్లో నీళ్ళు వదలడం చేస్తూ భయపెడతావనీ. ఇలా ఏవేవో విన్నాను. నేనేం చేయగలను. పైగా రెండు నెలలు అడ్వాన్స్ ఇచ్చాను. అసలదీగాక నాకు ఈ ఇల్లు నచ్చింది.

నేనిక్కడ పనిచేసుకోడానికి వచ్చాను. అంటే ఈ ప్రశాంతతలో చక్కగా కథలు రాసుకోడానికి వచ్చాను. సందర్భం గనుక అడుగుతున్నాను. ఇంతకీ నీకు కథలు ఇష్టమేనా? నీకు ఇష్టమైతే చెప్పు. నా కథలన్నీ నీకు చదివి వినిపిస్తాను. సరేనా? నీతో తగవులు లేవు నాకు. ఎందుకంటే మనిద్దరి మధ్యా ఏమీ జరగలేదు గనక. బావిలో రాయి అనాలోచితంగా వేశాను. అలా ఇక ముందు చేయను. నన్ను క్షమించు. వింటున్నావా భార్గవీ... అన్నట్టు నా దగ్గర మంచి గ్రామ్‌ఫోన్ ఉంది. మంచి రికార్డ్ లు కూడా ఉన్నాయి. ఇంతకీ నీకు సంగీతమంటే ఇష్టమేనా?''

ఇలా చాలా చెప్పాక మౌనంగా ఉండిపోయాను. ఇంతకీ ఎవరితో మాట్లాడుతున్నాను. దేన్నయినా మింగేసేలా నోరు తెరిచినట్టున్న బావితోనా? చెట్లు, ఇల్లు, ఈ వాతావరణంతోనా? చికాకుతో ఉన్న మనసుతోనా? నాలో నేనే అనుకున్నాను. మనసులో వున్న చిత్రమైన జీవి భార్గవితో మాట్లాడుతున్నాను. నేనెన్నడూ చూడలేదు. ఆమెకి ఇరవై ఒక్కేళ్ళు. ఆమె ఒకతన్ని గాఢంగా ప్రేమించింది. అతని భార్యగా జీవితాంతం ఉండాలనుకుంది. అలా కలలు గంది.

కానీ ఆ కల కలగానే మిగిలిపోయింది. దాంతో ఆమెకి జీవితంపైనే విరక్తి కలిగింది.

''భార్గవీ, నువ్వు అలా చేయకుండా వుండాల్సింది. నిన్ను అంటున్నానని గాదు. నీ ప్రేమికుడు మరొక అమ్మాయిని గాఢంగా ప్రేమించి ఉంటాడు. పెళ్ళి చేసుకున్నాడు. నీ జీవితం దుర్భరమైంది. నిజమే. కానీ జీవితాంతం అలానే ఉంటుందనుకోను. పోనీలేగానీ. నీ విషయంలో చరిత్ర పునరావృతమవుతుందా?''

''నిన్ను అంటున్నానని అనుకోకు - నువ్వు నిజంగా ప్రేమ కోసం మరణించావా? అద్భుతమైన ప్రేమకి జీవితమే ఉషోదయం. నువ్వొట్టి పిచ్చిపిల్లవి. నీ కసలు జీవితమంటేనే తెలీదు. మగవాళ్ళ మీద కోపం ఆ విషయం తెలియజేస్తోంది. ఒక్కటే తెలుసు. పోనీ అతను నీకు హాని కలిగించాడనే అనుకొందాం. కానీ అదే దృష్టితో అందరినీ చూడటం సబబేనా? నువ్విలా ఆత్మహత్య చేసుకోకుండా వుంటే నీ ఆలోచనా ధోరణే తప్పని తెలుసుకుందువు. అంతేకాదు నిన్నంతా దేవతగానూ భావించేవారు.

ఏదైనా నువ్వు నాకు హాని చేయవు. ఇది ఛాలెంజ్ కాదనుకో. వో విన్నపం మాత్రమే. నన్ను గొంతు పిసికి చంపితే నిన్ను అడిగే నాథుడే ఉండడు. నీ మీద కక్ష సాధించడానికి నాకు ఎవరూ లేరు కూడా'7

''భార్గవీ పరిస్థితి అర్థమైందా? మనమిద్దరం ఇక్కడ ఉంటున్నాం. అంటే నేను ఇక్కడ ఉండేందుకు నిర్ణయించుకున్నానన్న మాట. ఈ బావికి, ఇంటికీ ఇక నేను కూడా హక్కుదారుడినే. సరే, ఆ విషయం అలా ఉండనీ, కింది ఈ నాలుగు గదులు, బావి నువ్వు వాడుకో. పోతే, ఈ వంటగది, స్నానాల గదీ మనం సగం సగం వాడుకుందాం. ఈ ఒప్పందం అంగీకారమేనా?''

నాకు ఆనందమేసింది. ఏమీ జరగనందుకు.

రాత్రి అయింది. భోజనం చేసి వస్తూ ఫ్లాస్క్ నిండా టీ తెచ్చుకున్నాను. టార్చ్ వెలుగులో లాంతరు వెలిగించాను. పచ్చని కాంతి గదంతా నిండింది.

టార్చ్ సహాయంతో నెమ్మదిగా మెట్లు దిగి కిందకి వచ్చాను. కిటికీ రెక్కలు తెరిచాను. వంటింటి దగ్గరికీ వెళ్ళాను. స్నానాల గదిలో కుళాయిలు కట్టేయకూడదని అనుకున్నాను.

తలుపులన్నీ సరిగా వేసి పైకి వెళ్ళాను. కొద్దిగా టీ తాగాను. బీడీ వెలిగించి ఓ క్షణం కుర్చీలో కూర్చున్నా. రాయడానికి ఉపక్రమించాను. కానీ నా వెనక ఎవరో నుంచున్నట్టు అనిపించింది. భార్గవి?!

''నేను రాస్తున్నప్పుడు ఎవరైనా అలా చూడడం ఇష్టం ఉండదు'' అన్నాను.

వెనుతిరిగి చూశాను. ఎవరున్నారు? రాతపని కొనసాగించడానికి మనసొప్పలేదు. వో క్షణం అలాగే కిటికీ దగ్గర ఉండిపోయాను. చిరాకేసి అటూ ఇటూ పచార్లు చేశాను. బొత్తిగా గాలే లేదు. బయట వొక్క ఆకయినా కదలడం లేదు. కిటికీ లోంచి తొంగి చూశాను. అక్కడ దీపం వెలుగు! కానీ అది ఎరుపా? నీలమా? పసుపా? నిర్ధారించుకోలేక పోయాను. ఆ వెలుగు ఒక్క క్షణమే చూడగలిగాను.

అదంతా వొట్టి భ్రమ అనుకున్నాను. వెలుగు చూశానని, చూడలేదనీ చెప్పలేను. క్షణంపాటు కిటికీ దగ్గర అలానే ఉండిపోయాను. అక్కడ మళ్ళీ ఏమీ కనిపించలేదు. చూడడానికీ ప్రయత్నించనూ లేదు. ఏకాగ్రతతో గమనించలేక పోతున్నాను. చదివేందుకు మనసు లేదు. త్వరగానే పడుకోవాలని నిర్ణయించుకున్నాను. పక్క సద్దుకుని లైటు తీసేసి పడుకున్నాను. ఏదైనా రికార్డ్ వినాలని అనిపించింది. లాంతరు మళ్ళీ వెలిగించాను. గ్రామ్‌ఫోన్‌కి కొత్త ముల్లు బిగించాను.

ఇంతకీ ఎవరి పాట వినాలి. అంతా ప్రశాంతంగా ఉంది.

కానీ ఎక్కడిదో కూనిరాగం చెవుల్లో మారుమ్రోగుతోంది. భయమనిపించలేదు. కానీ ఏదో చిత్రమైన అనుభూతి. వొళ్ళంతా జలదరించినట్లయింది. అంతటా భయంకర నిశ్శబ్దం. నేను ఛేదించాలనుకుంటున్న నిశ్శబ్దం. మరి ఎవరి పాట ఆ పని చేయగలదు. రికార్డ్స్ అన్నీ వెతికి పాల్‌రాబ్సన్ రికార్డ్ తీశాను. షెంకో యుద్ధాన్ని జాషువా ఎదుర్కొన్నాడు అనే పాట అతని గొంతులో మధురంగా ఎంతో హుందాగా ఉంది.

తర్వాత పంకజ్ మల్లిక్ పాట 'తూ డర్నా సురభి (సురభీ... భయపడకుమా...) అంటూ. ఆ తర్వాత సుబ్బలక్ష్మి మృదుమధురంగా పాడిన తమిళ పాట 'కాంతినినే వరుం గీతం (గాలి తెమ్మెరల్లో సాగిపోతోంది నీ గీతం) అద్భుతంగా ముగిసింది. చివరగా సైగల్ పాటా అయిపోయింది.

ఇంతటితో ముగిద్దాం. మళ్ళీ రేపు వినొచ్చు అనుకుని గ్రామ్‌ఫోన్ మూసేశాను. లాంతరు ఆర్పేశాను. బీడీ వెలిగించి నడుం వాల్చాను. టార్చ్, వాచీ పక్కనే ఉన్నాయి. పడుకునే ముందు మేడపైకి వచ్చే ద్వారం తలుపులు మూసేశాను. రాత్రి పదింటి సమయంలో ఏదో శబ్దం వినిపించినట్లయింది. తీరా అది వాచ్ టిక్‌టిక్ మనే శబ్దం తప్ప మరోటిగాదు. అలా నిమిషాలు... గంటలూ గడిచాయి. ఇక భయం లేదు. కానీ అనుకోకుండా ఏమైనా జరుగుతుందేమోనని కాస్తంత తెలివిగానే ఉన్నాను. అయినా ఇలాటివేవీ కొత్తగాదు. నా ఇరవై ఐదేళ్ళ వొంటరి జీవితంలో ఇలాంటి అనుభవాలూ ఉన్నాయి. కానీ వాటి సారాంశమే తెలుసుకోలేకపోయాను. అందుకే గతానికి వర్తమానానికి మధ్య సందిగ్ధంలో పడ్డాను. ఇలా ఆలోచిస్తూనే ఉన్నా గానీ... తలుపుగొళ్ళెం శబ్దం. కుళాయిల్లో నీళ్ళు పోతున్న శబ్దం మధ్య మధ్యలో వింటూనే ఉన్నాను. ఎవరో గొంతు నులుముతున్న అనుభవం!! ఇలా రాత్రి ఒంటిగంట వరకూ...

ఇదంతా నిశ్శబ్దం తాలూకు భయం. నిజానికి నేనేమీ వినలేదు. ఎలాటి అనుభవమూ లేదు. చక్కగా నిద్రపోయాను. కలలు లేని నిద్ర. ఉదయం తొమ్మిదింటికి లేచాను.

హమ్మయ్య... ఏమీ జరగలేదు!!

''భార్గవీ, చాలా థాంక్స్. నాకో విషయం తెలిసింది. ఇక్కడి వాళ్ళు నా మీద అనవసర ప్రచారం చేస్తున్నారు. భార్గవీ, వాటిలో నిజం లేదు. వాళ్ళ ఇష్టం వచ్చినట్టు అననీ... నీకూ అలానే అనిపించిందా?''

అలా రోజులు, రాత్రులూ గడుస్తున్నాయి. రాస్తుండడంలో అలసిపోయినప్పుడల్లా చాలా రాత్రిళ్ళు రికార్డ్స్ వింటూండేవాడిని. ప్రతీ పాటకీ ముందు దాన్ని గురించీ ప్రకటించేవాడిని.

(మిగతా 14వ పేజీలో..)

## 'ఉన్నమాట' హైలైట్

'ఉన్నమాట' ఆంధ్రభూమికే హైలైట్. గత రెండువారాలుగా పార్టీషన్‌పై వస్తున్న వ్యాసాలు ఎంతో బాగుంటున్నాయి. భారతదేశ విభజన వెనుక ఇంతటి కథ నడిచిందంటే ఆశ్చర్యం వేసింది. ఆనాటి పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నారు.

గాంధీజీని బ్రిటీష్ ఏజెంట్ అనీ, పార్టీషన్ ఆయన తప్పేనని నిందించేవారున్నారు. ఆయన్ని హత్య చేయడానికి కూడా కారణం అదేనేమో. గాంధీజీ స్వాతంత్ర్య సమరంలోకి రాక ముందు నుంచీ హేమాహేమీలు కాంగ్రెస్ ద్వారా బ్రిటీష్ పాలకులకు తలబొప్పి కట్టించారు. విభజనకు జిన్నా స్వార్థమే ముఖ్య కారణమనిపిస్తుంది. బ్రిటీష్ వారి 'విభజించు - పాలించు' అనే ఆశయాన్ని నెరవేర్చడానికి దోహదం చేసింది.

పోతే 'విశ్వాసమే స్నేహానికి పునాది' 'స్త్రీవాద కవిత్వం' వ్యాసాలు ఎంతో బాగున్నాయి. ఆలోచనాత్మక రచనలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రభూమికి ధన్యవాదాలు.

మాఫియా గుప్పిట్లో ముంబై - వొళ్ళు గగుర్పొడిచేలా భయానకంగా ఉంది.

-జె. మనోకృష్ణ, నందిగామ

## 'స్నానాల గదిలో శవం'

ఆగస్టు 31, ఆదివారం అనుబంధంలో క్రైం కథ 'స్నానాల గదిలో శవం'లో డిటెక్టివ్ అహర్పతి కేసును పరిష్కరించిన విధానం అద్భుతంగా మలచారు. అలాగే శైలి రచన 'కలవరమాయె మదిలో...' కలల గురించిన వివరణ ఇస్తూనే కలలు కల్లలు కాకుండా నిజం చేసుకోవాలనే ఉద్బోధ ఉంది.

-గుంటోజు సత్యం, పోచంపల్లి

## కనువిప్పు కలిగించింది

ఆగస్టు 31, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్‌స్టోరీ 'మాఫియా గుప్పిట్లో ముంబాయి' మాఫియా ముఠాల గుట్టు రట్టు చేసింది. సినీ పరిశ్రమలో మాఫియా ఎలా ప్రవేశించిందీ, పరిశ్రమను మొత్తం తన చేతుల్లోకి తీసుకొని ఏకచ్ఛత్రాధిపత్యాన్ని వహిస్తున్న ముఠాల గురించి వివరణ బాగుంది. 'భావన'లో కవితలు ఎంతో బాగుంటున్నాయి. ఈ వారం కథ 'సత్తిగాణ్ణి సదివిత్తా' కనువిప్పు కలిగించే విధంగా ఉంది. గిలిగింత, టీనేజ్ బాగున్నాయి.

-కె. దుర్గాప్రసాద్, నారాయణపురం

# ఆత్మహత్యల రాజధాని!

బెంగుళూరు. భారతదేశపు ఆత్మహత్యల రాజధాని! అవును. ఇటీవలి కాలంలో అక్కడ విపరీతంగా పెరిగిపోయిన ఆత్మహత్యల రేటుని చూస్తే అలాగే పిలవాలనిపిస్తుంది. ఆత్మహత్యల విషయంలో దేశంలోని మరే నగరం బెంగుళూరుకు సమీపంలో కూడా లేదు. ఆత్మహత్యల రేటు కలకత్తాలో 2.1, డిల్లీలో 6.8, ముంబయిలో 9.1 గా వుండగా బెంగుళూరులో ఆ రేటు 31.2 (ది నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో)గా వుండటం ఈ భయంకర వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. ఉద్యోగావకాశాలు అత్యధికంగా వుండే నగరంగా బెంగుళూరుకి ఇంత దాకా పేరున్నది. నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా అది వాసికెక్కింది. బహుశా ఇదే అంశం అక్కడి జన జీవితంపై వత్తిడులు కలగజేస్తున్నదా అనే సందేహం వస్తుంది. ప్రత్యామ్నాయంగా తమ జీవితాన్ని అంతం చేసుకోడమే మార్గమని ఒత్తిళ్ళు తట్టుకోలేని వారు భావిస్తున్నారనే ఊహ వస్తుంది.

ముంబయి, కలకత్తాల మాదిరిగా బెంగుళూరు సొంత అస్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవడంలో వెనుకపడ్తోంది. తాము కోరుకున్న విధంగా జీవితాన్ని మలచుకోడానికి అక్కడ పరిస్థితులు సహకరించడం లేదు. భరించగల్గే స్థాయికి మించి అక్కడ జనాభా పెరిగిపోతున్నది. ఫలితంగా అన్ని రకాల వైఫల్యాలు సంభవిస్తున్నాయి. ఇందులో ఆత్మహత్యల పెరుగుదల కూడా ఓ అంశం. ఇదే విషయాన్ని బెంగుళూరులోని సెయింట్ మార్తాస్ హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డ్యాక్టర్ అజిత్‌భిడే అంగీకరిస్తున్నారు. అక్కడి సమాజం రోగగ్రస్తమై పోయిందని, సంఘ ఆలంబన విధానం అస్తవ్యస్తమై పోయిందని ఆయన పేర్కొన్నారు. ఆత్మహత్యలకి పాల్పడుతున్న వారిలో ఎక్కువమంది పాతికేళ్ళలోపు యువతీ యువకులే. సాంఘిక గుర్తింపు, సాంఘిక సమైక్యతలపై సరైన అవగాహన లేనివాళ్ళే ఎక్కువగా ఈ దుశ్చర్యలకి పాల్పడుతున్నారు. జనాభా ప్రవాహంలాగా పెరిగిపోతుండటంతో అనేక సంస్కృతులు, విలువల పద్ధతుల మధ్య సంఘర్షణ చెలరేగి మానసికపరమైన సమస్యలకి దారితీస్తున్నాయని - ఫలితం ఆత్మహత్యలని బెంగుళూరులోని మానసిక ఆరోగ్య సంస్థ 'విశ్వాస' మాజీ డైరెక్టర్ పి.ఆర్.ఎన్.మూర్తి చెప్తున్నారు. సమాజంలోని ఈ అస్తవ్యస్థ ధోరణుల్ని సరిచేయడంలో తన వంతు పాత్రని నిర్వహించడానికే విశ్వాస్ ఉద్భవించింది. ప్రస్తుతం ఆ సంస్థ కింద చురుకైన కార్యకర్తలు పనిచేస్తున్నారు. అంతర్గత సమస్యలు, ఆత్మన్యూనతాభావం, ఒత్తిడులు, ఒంటరితనం, వ్యక్తిత్వ సమస్యలతో బాధపడ్తున్న ప్రజలకి సహకారం అందించడమే ఈ స్వచ్ఛంద కార్యకర్తలు చేసే పని. విశ్వాస్‌లో ఆ రకం ప్రజలకి అవసరమైన కౌన్సిలింగ్ లభిస్తోంది. ఆత్మహత్యలకి కారణాలు వెతకడం కంటే వాటిని నివారించడమే ముఖ్యమని సంస్థ ప్రస్తుత డైరెక్టర్ డ్యాక్టర్ ఉత్తర పేర్కొన్నారు. ప్రజల మీద ఒత్తిళ్ళని తగ్గించి మెరుగైన జీవనాన్ని వాళ్ళకి అందించే కృషిని ప్రభుత్వం చేపట్టాలని అక్కడి సామాజికవాదులు కోరుతున్నారు.

-ప్రద్యుమ్న

# నీలివెలుగు

కథ

(12వ పేజీ తరువాయి..)

తర్వాత పాట బెంగాలీ గాయకుడు పంకజ్ మల్లిక్ పాడింది. జ్ఞాపకాలతో సాగుతుంది భావం. సరిగా విను. 'గుజర్‌గయా వో జమానా... కైసా కైసా' ఇలా వివరించేవాడిని. అలాగే బ్రింగ్‌క్రాస్బీ పాట. 'మూన్‌లైట్' రికార్డ్ సారాంశం 'నువ్వింకా విన్నదానివే... క్షమించు'

ఇలా రెండు నెలలు గడిచింది. ఇంటి ఆవరణలో చిన్న తోట పెంచాను. పూలన్నీ భార్గవికే అమకునేవాడిని. ఆ రోజుల్లోనే నేనో నవలిక రాశాను. స్నేహితులు వస్తుండేవారు. రాత్రిళ్ళు నాతోటే వుండేవారు. వాళ్ళు నిద్రపోయే ముందు వాళ్ళకి తెలికుండా మెల్లమెల్లిగా మెట్లు దిగి కిందికి వచ్చి చీకటిలో మాట్లాడేవాడిని.

''అమ్మా భార్గవీ! ఈ రాత్రికి నా స్నేహితులు ఇక్కడే ఉంటానని అంటున్నారు. వాళ్ళేమీ చేయకు. అలా జరిగితే పోలీసులు నన్ను అరెస్ట్ చేస్తారు. అంచేత కొంచెం జాగ్రత్త... గుడ్‌నైట్'' అని చెప్పేవాడిని.

అలాగే ఊర్లోకి వెళ్ళేప్పుడు.

''భార్గవీ ఇల్లు జాగ్రత్త. దొంగలెవరైనా చంపు. కానీ శవాన్ని మాత్రం మూడు మైళ్ళ అవతలికి తీసుకెళ్ళు. లేకపోతే ఇబ్బందుల్లో పడేది మనమే సుమా'' అనేవాడిని. ఎప్పుడైనా రాత్రి సినిమాకి వెళ్ళి వచ్చినప్పుడు మాత్రం ''నేనే....'' అనేవాడిని. ఎవరో అడిగినట్టు!

ఇదంతా నేనిక్కడ వున్నప్పుడు తొలిరోజుల్లో సంగతి. క్రమేపీ అసలు భార్గవి సంగతే మర్చిపోయాను. ఎప్పుడో గుర్తు వచ్చినప్పుడు తప్ప నేను ఆమెతో మాట్లాడలేదు.

ఈ లోకంలో మానవజాతి ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని వేల వందల మంది మరణించారు. మట్టిలో కలిసిపోయారు. వాళ్ళందరూ మనకేమీ తెలుసు. కానీ భార్గవి ఓ జ్ఞాపకంలా నిలిచింది. అలానే గుర్తుంచుకున్నాను.

ఇదిలా ఉండగా, ఓ రోజు ఒక సంఘటన జరిగింది. అదే రాత్రి పదిగంటప్పుడు. నేను తొమ్మిదింటి నుంచి ఒక కథ రాస్తున్నాను. ఎంతో ఉదాత్తమైన కథ. తల అటూ ఇటూ తిప్పకుండా ఎంతో ఏకాగ్రతతో రాస్తున్నాను. లాంతరు వెలుగు క్రమేపీ తగ్గుతున్నట్టు తెలుస్తోంది.

దీపాన్ని ఒకసారి కదిలించాను. అందులో కిరోసిన్ లేదు. ఉన్న గుడ్డి వెలుగులోనే మరో పేజీ రాయగలననుకున్నా. మనసంతా రాస్తున్న కథ మీదే ఉంది. దీపం వెలుగు తగ్గుతుంటే సహజంగా ఎవరైనా ఏం చేస్తారు. అందులో కిరోసిన్ ఎంతుందో చూస్తారు గదా, నేను చేసినట్టే. వొత్తిని పైకి లాగాను. మళ్ళీ వెలుగు తగ్గింది. మళ్ళీ వొత్తిని సరిచేసి మళ్ళీ రాయడం ప్రారంభించాను. ఇలా జరుగుతుండగా దీపం వొత్తి నాలుగు అంగుళాల పొడవు, ఒక అంగుళం వెడల్పుతో ఏదో తగలడుతున్న వస్తువులా అనిపించింది.

టార్చ్ వేసి వొత్తిని బాగా తగ్గించాను. అంటే దీపం ఆరిపోయిందనే చెప్పాలి. ఎవరైనా దీపం వెలుగు ఎలా సాధిస్తారు? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

లాభం లేదు. వెళ్ళి కిరోసిన్ తెచ్చుకోవాలి. బ్యాంక్‌కి వెళ్ళే దారి తెలుసు. బ్యాంక్ బిల్డింగ్ ఒక భాగంలో క్లర్క్స్ ఉంటున్నారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి కొంచెం కిరోసిన్ అడిగి తెచ్చుకోవాలి. టార్చ్ తీసుకుని కిరోసిన్ సీసాతో బయలుదేరాను. తలుపు తాళం వేసి వీధిగేటు దగ్గరగా వేసి వెన్నెల గాని వెన్నెట్లో నడుచుకుంటూ వెళ్ళాను.

వేగంగా నడిచి బ్యాంక్ బిల్డింగ్ చేరాను. బ్యాంక్ ముందు నుంచోని పైకి చూస్తూ నా క్లర్క్ స్నేహితుల్ని పేరు పెట్టి పిలిచాను. ఒకతను కిందికి వచ్చి బిల్డింగ్ పక్కగేటు తీశాడు. బిల్డింగ్ పక్కనుంచి వెళ్ళి మేడ మెట్లు ఎక్కాం. తీరా పైకి వెళ్ళాక తెలిసింది - వాళ్ళు పేక ఆడుతున్నట్టు.

కిరోసిన్ కావాలని అడగ్గానే వారిలో ఒకతను నవ్వుతూనే ''మరి భార్గవినే అడక్కపోయావా తెమ్మనమని'' అని వెటకారం చేశాడు. నాకు నవ్వొచ్చింది. కిరోసిన్ ఏమీ అనలేదు. వాళ్ళలో ఒకతను స్టవ్‌లోంచి కిరోసిన్ తీస్తుండగానే బయట వర్షం మొదలైంది.

''మీరు గొడుగు కూడా ఇవ్వాల్సి వస్తుంది''

''సారీ... కనీసం చిన్న కర్రయినా లేదు. కార్డ్స్ ఆడదాం... వర్షం తగ్గాక వెళ్ళొచ్చు'' సలహా ఇచ్చాడు.

అంతేక నేనూ ఆడాను. నేను, నా పార్ట్‌నర్ మూడు రౌండ్స్ ఓడిపోయాం. ఆట మీద ధ్యాస లేకపోవడం వల్లే అలా జరిగింది. నిజానికి ధ్యాసంతా రాస్తున్న కథ మీదే ఉంది. రాత్రి ఒంటిగంటకి గాని వర్షం తగ్గలేదు. ఇహ బయలుదేరమని టార్చ్ కిరోసిన్ చేతపట్టాను. క్లర్క్స్ నిద్రకి ఉపక్రమించారు. నేను మెట్లు దిగి రోడ్డుపైకి రాగానే వాళ్ళ గదిలో లైటు తీసేశారు.

రోడ్డు మీద ఎలాటి కదలిక లేదు. కనీసం ఎక్కడా గుడ్డి దీపమైనా లేదు. అలా చీకట్లో టార్చ్ సహాయంతో నడిచాను. రోడ్డు మలుపు తిరిగి ఇల్లు చేరాను.

ఇంట్లోకి వస్తూ వీధి తలుపులు వేశాను. నేను వచ్చేలోగా పైన ఏదయినా అనుకోని విధంగా జరిగి ఉంటుందని ఆలోచించడంలో అర్థం లేదు. కానీ ఒక్క సంగతి చెప్పాలి. కారణం లేకుండానే మనసులో ఎందుకో దిగులుగా ఉంది. నాకు ఏడవాలని ఉంది. సాధారణంగా నాకు ఒక్క బొట్టయినా కన్నీళ్ళు రావు. మనసు దిగులుగా వున్నప్పుడు ఆధ్యాత్మిక భావంతో నిండుతుంది. సరిగ్గా అలాగే అనిపించింది.

అలాంటి స్థితిలోనే మెట్లెక్కి పైకి వెళ్ళాను. కానీ ఊహించని దృశ్యం కనిపించింది. అక్కడ ఏమైందంటే - నేను తలుపులు తాళం వేసి వెళ్ళే ముందు కిరోసిన్ లేకపోవటం వల్ల లాంతరు దీపం ఆరిపోయింది. గదంతా చీకటిమయంగా ఉంది. తర్వాత కొంతసేపు వర్షం కూడా వచ్చింది. మూడు గంటలు గడిచింది. కానీ ఇప్పుడు దీపం వెలుగుతోంది. తలు సందులోంచి తెలుస్తోంది ఆ వెలుగు. కానీ అది అంతకు ముందు చూసిన వెలుగు కాదు. నేను అనుకున్న వెలుగూ కాదు. కానీ అదేమిటనే రహస్యం అంతుపట్టడంలేదు.

మామూలుగానే జేబులోంచి తాళం తీసాను. టార్చ్ వెలుగులో తలుపు గొళ్ళెం వెండిలా మెరిసింది. కాదు అదీ నవ్విందనే అనుకుందాం.

తలుపులు తీసి లోపలికి వెళ్ళాను. అన్ని వస్తువులూ చూశాను. గదిలో ఏం జరిగిందో అంతా తెలుస్తోంది. భయంతో వొణికిపోలేదు గానీ ఆశ్చర్యంతో అలా ఉండిపోయాను. చిత్రమైన అనుభూతికి చెమటలు పట్టాయి.

గదంతా... తెల్లటి గోడలా నీలికాంతిలో మెరిసాయి. ఆ కాంతి గదిలోని దీపం నుంచే వస్తోంది. రెండు అంగుళాలు మేర కాంతి. ఆశ్చర్యంతో నేనలాగే చూస్తుండిపోయాను. కిరోసిన్ లేని లాంతరుని ఎవరు వెలిగించారో?! ఈ నీలికాంతి ఎక్కడ నుంచీ వచ్చింది?!

☆

# మతిమరపును ఇక మరచిపోండి!

చాలామందిని మతిమరపు వేధిస్తుంటుంది. వయసు మీద పడ్తున్న కొద్దీ మతిమరపు ఎక్కువౌతుందని అనుకుంటూ వుంటాం. అయితే ఇది అపోహ మాత్రమే. ఈ మతిమరపు చిహ్నాలు యువకుల్లోనూ కన్పిస్తుంటాయి. మతిమరపు కేవలం వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైంది కాదు. కొంతమంది విద్యార్థులు తాము చదివినదేమీ జ్ఞాపకం వుంచుకోలేరు. కొంతమందయితే తమకి బాగా పరిచయమున్న వ్యక్తుల పేర్లే మరచిపోతూ ఇబ్బందికి గురవుతుంటారు. మనోవైజ్ఞానికులు సూచిస్తున్న దాని ప్రకారం మతిమరపును పోగొట్టుకోడానికి తొలి ప్రయత్నంగా ఆయా వస్తువుల్నీ, పేర్లనీ, విషయాల్నీ - ఇతర వస్తువులతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకి మీరు పుస్తకాన్ని టేబుల్ సొరుగులో భద్రపరిచారనుకోండి. తర్వాత పుస్తకాన్ని ఎక్కడ పెట్టారో జ్ఞాపకం రాక తికమకపడ్తారు. అందుకని పుస్తకంతోపాటు టేబుల్నీ, టేబుల్‌తోపాటు దానిపై వున్న ఫ్లవర్‌వాజ్‌నీ జతకలిపి జ్ఞాపకం పెట్టుకోవాలి. పుస్తకం ఎక్కడ పెట్టారో గుర్తు చేసుకునేటప్పుడు మీకు ఫ్లవర్‌వాజ్ జ్ఞాపకం వస్తుంది. ఆ వెంటనే పుస్తకం ఎక్కడ పెట్టారో కూడా జ్ఞాపకం వొస్తుంది. అట్లాగే చంద్రశేఖర్ అనే వ్యక్తి పేరును మీరు జ్ఞాపకం పెట్టుకోవాలంటే అతని పేరుతో పాటు అతని అలవాటుని జతచేయండి. అతని పేరు జ్ఞాపకం రాక ఇబ్బంది పడ్తున్నప్పుడు అతని రూపం, దాంతోపాటు అతని అలవాటు జ్ఞాపకం వస్తుంది. తక్షణమే అతని పేరు స్ఫురిస్తుంది. ఒక్కోసారి మన జ్ఞాపకశక్తి పట్ల వుండే సందేహంతో ఆందోళనకి గురవుతుంటాం. ఈ ఆందోళనవల్ల మన జ్ఞాపకాల వలయాలు బయటికి రావు. అందుచేత ఏ విషయాన్నైనా జ్ఞాపకం వుంచుకోడానికి మనస్సు ప్రశాంతంగా వుండటం చాలా అవసరం. ఓ విషయాన్ని గూర్చిన స్మృతి మన హృదయంలో దాగి ఉంటుంది. ఆ స్మృతిని మననం చేసుకోడం ద్వారా అవసరమైన విషయాన్ని జ్ఞాపకం చేసుకోగల్గుతాం. ఐతే ఆందోళనకి గురైనప్పుడు ఆ స్మృతిపై ఆలోచనలు కేంద్రీకరించలేం. ఏకాగ్రత లోపించడంతో ఆ విషయం జ్ఞప్తికి రాదు.

కొంతమంది విద్యార్థులు పాఠ్య గ్రంథాల్ని గంటల తరబడి ఏకాగ్రత లేకుండా ఏవేవో ఆలోచిస్తూ చదువుతుంటారు. అందుచేత వాళ్ళు చదువుతున్న విషయాలు వాళ్ళ హృదయంలో స్పష్టమైన తీరులో నిక్షిప్తం కావు. చదివినదంతా హృదయంలో అస్పష్టంగా, పొంతన లేకుండా మిగిలిపోతుంటాయి. వీటిని మళ్ళీ జ్ఞాపకం చేసుకోడం చాలా క్లిష్టమై పోతుంది. అందుకని మనం జ్ఞాపకం పెట్టుకోవాల్సిన విషయాలపై పూర్తి ఏకాగ్రత చూపాలి. ఏకాగ్రత సాధించడమనేది అసాధ్యమైన విషయమేమీ కాదు. క్రమబద్ధమైన శిక్షణ ఏకాగ్రతకి దోహదం చేస్తుంది. ఇతర ఆలోచనలతో సతమతం కాకుండా మనం చదువుతున్న వాటిపై ఏకాగ్రత చూపాలన్న పట్టుదల మనలో వుండాలి. ఇతర్ల బలవంతం మీద యాంత్రికంగా అనాసక్తితో చదివినప్పుడు అవి జ్ఞాపకం వుండటం సాధ్యం కాకపోవచ్చు. అలా కాకుండా చదివిన వాటిని జ్ఞాపకం వుంచుకోవాలన్న పట్టుదల వున్నప్పుడు చదివినవి మర్చిపోవడం జరగదు.

-రాహుల్

# పూల లోయ

మహాభారతంలో ఓ కథ ఉంది. పాండవులు వనవాసం చేస్తున్నప్పుడు ఒకచోట ఆగారట. అక్కడ ప్రవహిస్తున్న అందమైన నదిలో ద్రౌపది స్నానం చేస్తుంటే పరిమళ భరితమైన పూలు కనపడ్డాయట! ఆ సౌగంధికా పుష్పాలను తీసుకురమ్మని భర్త భీముణ్ని కోరిందట ద్రౌపది.

భీమసేనుడు ఆ పూల కోసం అన్వేషిస్తూ ఓ అందమైన లోయ వద్దకు చేరుకున్నాడు. ఆ పూలలోయ కుబేరుడిది! కుబేరుడిసైనికులకు, భీమసేనుడికి మధ్య హోరాహోరీ పోరు జరగడం... ఇదీ ఆ తర్వాతి కథ! ఇంతకీ ఆ పూలలోయ నిజంగానే ఉంది. గఢ్వాల్‌కి చెందిన చమేలీ జానపద గాథల్లో దీని గురించి పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పాండుకేశ్వర్ అంటారు. ఈ పూలలోయ దాదాపు పదికిలోమీటర్ల పొడవు, రెండు కిలోమీటర్ల వెడల్పుతో ఉంది. ఈ లోయ మధ్యగా పుష్పవతి అనే నది ఉంది. రకరకాల జాతులకు చెంది రంగురంగుల పుష్పాలతో ఈ లోయ శోభాయమానంగా ఉంటుంది. ఈ పూలలోయ మన దేశంలోనే కాకుండా - ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధం. గఢ్వాల్ ప్రాంతంలోని గిరిజనులు దీనిని 'బ్యూండార్ లోయ'గా పేర్కొంటుంటారు. 'బ్యూండార్' అంటే ఆ గిరిజన భాషలో భీముడు అని అర్థం. ఈ ప్రదేశంలో మనుషులు నివసించడానికి భయపడతారు. ఎందుకంటే ఇది దేవతలు సంచరించే ప్రదేశంగా వారు గౌరవిస్తుంటారు. ఈ పూలలోయ క్రీ.శ.1931 నుంచి ప్రసిద్ధి చెందింది. ఆ ఏడాది బ్రిటీష్ పర్వతారోహకుడు ఫ్రాంక్ స్మిత్ దారితప్పి, ఈ పూలలోయకు చేరుకున్నాడు. ఈ పుష్పాల సౌందర్యానికి ముగ్ధుడయి 'వేలీ ఆఫ్ ఫ్లవర్స్' అని నామకరణం చేశారు. ఆ తర్వాత జోన్ మార్గరెట్ లీగ్ అనే ఓ ఆంగ్ల వనిత ఈ ప్రదేశానికి వచ్చి, కొద్దిరోజులపాటు గడిపింది. ఒకరోజు పూల మధ్య తిరుగాడుతూ కాలుజారి లోయలో పడి మరణించింది. ఇప్పటికీ జోన్ మార్గరెట్ లీగ్ సమాధి ఆ ప్రదేశంలో ఉంది. ఈ పూలలోయ హరిద్వార్ - జోగీమఠ్ - బదరీనాథ్ మధ్యలో ఉంది. గోవింద్‌ఘాట్ అనే ప్రదేశం నుండి కాలినడకన ఈ లోయ చేరవచ్చు. మార్చి - ఏప్రిల్ మధ్యకాలంలో పూలు బాగా వికసిస్తాయి. సెప్టెంబర్ - అక్టోబర్ మధ్య కాలంలో ఈ ప్రదేశం సందర్శించడానికి అనువైనది.

-మనోజ్ఞ